Susecla, M.A.

సాహిత్యోపన్యాసములు — 11

వసుచరిత్ర -
సంగీత సాహిత్యములు



ప్రచురణ:

ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమి

కళాభవన్ : : హైదరాబాద్ - 4

వి.సుశీలాప్రసాద

వసుచరిత్ర -
సంగీత సాహిత్యములు

(సాహిత్యోపన్యాసాలు – XI)

(8-7-1978 నాడు హైదరాబాదులో జరిగిన ఉపన్యాసాలు)

ప్రచురణ:

ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమి

కళాభవన్ :: : హైదరాబాద్ - 4

సర్వస్వామ్య సంకలితము
కొలికూర్పు - 1974

ముద్రణ :
నాట్యకళ ప్రెస్,
ఖైరతాబాదు, హైదరాబాదు-500004.

వసుచరిత్ర-నృత్య గీతాది కళావిశేషములు

శ్రీ పుట్టపర్తి నారాయణాచార్యులు

అడుగు వెట్టదు నవ్య హరిచందన లతాంత
సరణిపైగాని యీ యరుణ చరణ-
కేలనంటదు కోరకిత పారిజాత వ
ల్లరిగాని యీ యతిలలిత బాహ-
తనువు జేర్చదు నవోదార మందార మం
జుల శయ్యగాని యీ సురభిశాంగి-
పెదవిజేర్చదు కల్ప పృథివీజఫలసంత
తియెగాని యీమోవి తీపులాడి

గురుకుల క్రమాయాత మీ గిరిజ చల్ల
దనము, జనైక రూఢమీ తటిని పట్టి
సరస గంభీర భావంబు, సహజ సిద్ధ
మీ నలిన సోదరీమణి మేనికావి.

పై పద్యము మంజువాణిది; వసురాజును-నర్మసఖుడును శ్రోతలు. మంజువాణి పుంవత్ప్రగల్భ మాత్రమేగాదు; పురుషులకన్నను ప్రగల్భ. ఇందులో-గిరికాదేవి సౌందర్య సౌకుమార్యాదులు వర్ణింపఁబడినవి. ఆమెకు నాల్గు 'విశేషణములు;' గిరిక 'యరుణచరణ' 'అతిలలిత బాహ' 'సురభిశాంగి' 'మోవితీపులాడి' ఈ సరకులన్నియు-సాధారణముగా కవిత్వపు బజారులో దొరుకునవే. వీనికి మనమంత ఆశ్చర్యపడవలసిన పనిలేదు ఎఱ్ఱని యడుగులు గల గిరికాదేవి-హరిచందన వృక్షముయొక్క చిగురుటాకులతో గూడిన దారిమీదనేగాని-యడుగువెట్టదట.! అనఁగా నేమి? ఆమె పాదములు పల్లవ

ములకంచెను–సుకుమారములు; పల్లవనిచిత పథములలోగాని యామె నడువజాలదని యర్థము. "అరుణ చరణ" అనుటచే-నడుగులెర్రని లేజిగురు టాకులవంటి వనియు నొక భావము. చిగురుటాకులకుఁ జిగురుటాకులతోనే పొత్తు గుదిరినది పాపము!

"అతిలలిత హాహా"- యెక్కువ లలితములైన హాహుపులు గలది. కనుకనే-యామె, కోరకిత పారిజాత వల్లరినిదప్పఁ దక్కిన వానినిఁ గేల నంటదు. పారిజాతపుఁ దీగెకంచె-నామె చేతులెక్కువ మృదువైనవి. అందుచే యాతీగలనే గిరిక ముట్టను; "అతిలలిత" యను విశేషణము రెంటికి నన్వయించును ఆమె పారిజాతవల్లరి నెందుకంటును? దానికి సమాధాన మక్కడనే యున్నది. అది కోరకితము; అందుచే "మొగ్గలు గిల్లుట"- కని యుత్తరము. పుష్పావచయము ప్రబంధనాయికలకొక విలాసము గదా!

"సురభిళాంగి" వానన లొలుకుచున్న దేహము గలది; అగుటచే సవ్యేదార మందార మంజుల శయ్యలందే మేనునేర్చును. ఆమె శరీరము మందార పుష్పముల కన్నను మృదువైనది. కనుక మందార పుష్పశయ్యనే గాని పరుండదట! "సురభిళ" శబ్దముచే నిచటఁ బుష్పములు సూచితములు. తదనుగుణముగా మందార శబ్దముచేతను వాని పుష్పములే గ్రాహ్యములు; పువ్వులవంటి శరీరమునకుఁ బువ్వులతోడి పొత్తే యుచితమని భావము.

'మోవితీపులాడి' పెదవి యొక్క తియ్యదనము గలది; అది కల్ప పృథ్వీజ ఫలసంతతినే కాని పెదవి చేర్చదట; అనఁగా ననుభవింపదనుట! రెండు తీపులకు సంసర్గము మంచిదే గదా!

పై పాదములలో దేవతా వృతము లైదింటిలో నాల్గు చెప్పఁబడినవి; హరిచందన, పారిజాత, మందార, కల్పములు; సంతాన వృక్షమెందుకో తప్పించికొన్నది. క్రమము దప్పక, పల్లవిత, కోరికిత, పుష్పిత ఫలితత్వములను వచించినాఁడు ఇంత మాత్రమే గాదు చిగుళ్ళకును పాదములకును అరుణ్యము సామాన్య ధర్మము. అందుచే 'అరుణచరణ' అన్నాఁడు. వల్లరికిని, హావభావునకును లాలిత్యము సామాన్యధర్మము. కనుకనే 'అతిలలిత హాహా' యనుట. మందార శరీరములకు, సౌరభ్యము సామాన్య మగుటచే

'సురభికాంగి' యైనది; కల్పఫలములకును, మోవికిని, సామాన్య ధర్మముగాఁ దీపిని గైకొన్నాఁడు. ఇవి సాభిప్రాయములైన విశేషణములు. గిరిక చల్లదనము అనగా సౌమ్యభావము. గురుకుల క్రమాగతమట! గొప్పవంశమునుండి వచ్చినది. తండ్రి కాతలవాటి యాస్థియని తాత్పర్యము. హిమవంతుడు శీతనగము గదా! ఈ 'తటిని పట్టికి' సరసత్వ గాంభీర్యములు పుట్టుకతోడనే వచ్చినవి. 'జలమయత్వములో' నని యర్థాంతరము. గిరిక మేనికావి 'సహజ' సిద్ధము; అనగా స్వభావసిద్ధము సహజము లనఁగాఁ దోడబుట్టినవి. పద్మములు; వాని నుండి యేర్పడినదనియు నొకయర్థము. పద్మినీ జాతుల దేహయష్టి నుండి తమ్మికావులు ఘుమ్ముమనునట! గిరికది పద్మినీజాతి యని సూచించుచున్నాడు. ఈ నాల్గు పాదములందును, సమృద్ధి మద్వర్ణన యున్నది గనుక, యుదాత్తాలంకారము.

పై వానిలో దేవ వృక్షములనే యొంచుటామె యాభిజాత్యమునకు గుర్తు. పల్లవములడుగులు; కోరకములు రోమాంచములు; వల్లరి శరీరము; మందార పుష్పములలోని, సౌకుమార్య సౌగంధ్యము లామె గాత్రమున కున్నవి. 'మోవితీపు' కల్ప వృక్షఫలముల తీపివంటిది. గిరికపెదవి యెర్రనిది; కల్పవృక్షఫలములు కోరి కొన్న రంగులో నుండును. అవి గూడఁ దత్కల్పములే. ఇవన్నియును పర్యుపరి సౌందర్యములు; ఈ యందములు, సాదృశ్యమునఁ బర్యవసించుచున్నవి. ఈ పద్యములోని విశేషణములు సాభిప్రాయములగుటచేఁ బరికరాంకురాలంకారము. చాలని చానికి "లతాంత" మనగాఁ "జిగురు టాకు" అనుటకు గొంత వ్యుత్పత్తిగావలెను.

పై పద్యములో నింతవిశేషమున్నది. ఇట్టిదే యీ క్రిందివద్యము.

"మోహోపదేశతమో ముద్రితములైన
కనుదమ్ముల హిమాంబు లనువరాదు
శ్రమ బిందు కారకాగమఖన్న కుచకోక
ములఁ బుంద్రనామంబు దలఁపరాదు
శీర్యదాశావృంత శిథిల తాసులతాంత
మసియాడ వీవనల్ విసరరాదు

పటుతాప పుటపాక పరిహీనతను హేమ
మింక పల్లవ పుటా ర్చిడగరాదు

లలన శానంగకీలి కీలాకలాప
సంతశాలీఢ హృదయ పాత్రాంతరాళ
పూరిత స్నేహపూరంబు పొంగిపొరల
చల్లని పటీర సలిలంబు చల్లరాదు

—గిరికాదేవి మూర్ఛపోయినది. ఆమెకుఁ చెలికత్తె లుపచారములు సేయుచున్నారట! మన కిట్టి మూర్ఛలు దెలియవు లెండు. ఇది ప్రబంధనాయికల గొడవ. మనము చదివి లొట్టలు వేయవలసినవి. అంతే, ప్రణయ మూర్ఛలు వచ్చినప్పుడు సాధారణముగా—ప్రబంధనాయికల కేమిసేతురు? మొగముపై బన్నీరు చల్లుదురు; కుచమండలమునఁ గర్పూరము రాతురు; విసనకర్రలతో విసురుదురు. చిగురుటాకులే పాన్పుగాఁ బఱచి—పవ్వళింపఁ జేతురు.

ఇంకను మత్తు దిగకున్నచో—శరీరమంతయుఁ జందనపు నీరు జిలుకరింతురు. ఇది ప్రణయమూర్ఛకు వైద్యము. గిరికాదేవి కీయుపచారములు సేయరాదనుచున్నారు 'డయాగ్నైజు' చేసిన కొందరు చెలికత్తెలు. ఎందుకు? వారి కారణములివి మోహమనెడు చీకటి ముసరుకొన్నది. మోహము నల్లగా నుండునని కవి సమయము. ఆమె కనుదమ్ములు ముకుళించినవి. పద్మములపైఁ బడిన మంచునీరు దానిని నాళమొనర్చును. దీనినే కాళిదాసిట్లన్నాడు.

అథవా మృదువస్తు హింసితుం
మృదునైవారభతే ప్రజాంతకః
హిమసేకవిపత్తి రత్రమే
నళినీ పూర్వ నిదర్శనా మతా॥

—హిమాంబువులను మాట శ్లిష్టము. పన్నీరు-మంచునీరని రెండర్థములు; శాబ్దికమంతయు—నాభాస మాత్రమే గదా! ఈ ప్రశ్నకాతఁడు బదులు చెప్పడు. స్వేదబిందువులను నఖక్షతములతోఁ బోల్చుటయు — కుచములను

శోకములతో బోల్చుటయుఁ గవి ప్రస్తాన ప్రసిద్ధములే. శ్రమబిందు తారకా గమముతోనే కుచచక్రములు భిన్నములైనవి; ఇఁక చంద్రోదయమైనచో గతియేమి? చంద్రశబ్దమునకు కర్పూర చంద్రులర్థము;[1] అసులశాంతము—ఆశావృంతము నంటుకొని యున్నది. ఆయాశావృంతము అసియాడుచున్నది. ఆ పూలెప్పుడు పడునో! అందుచే వీవనలు విసరరాదట! శరీరమనెడుబంగారు—శాపమనెడు పుటపాకములో నిప్పటికే గరిగిపోయినది మరల పల్లవపుటార్చిలో బెట్టినచో పస్తువే మిగుల కుండఁబోవును గదా! బంగారముపుటముపెట్టినపుడు వన్నె పెచ్చుకొలఁదిని తూనిక తగ్గుచుండునట; 'పల్లవపుట + అర్చి'—అనియు పల్లవపుటార్చి యనియు రెండు పద విభాగములు. పోనీ! శరీరముపై జందనపు నీరు జల్లుదమా! యని కొందరు బేలలన్నారు. అనుభజ్జులైన చెలులు దానిని గూడ దృణీకరించిరి. కారణము హృదయమనెడు పాత్రలో స్నేహమనెడు స్నేహపూరము సలసల మఱుగుచున్నది. దానిపై బటీరసలిలము జల్లినచో! కాలుచున్న నూనెపై నీరు జిలుకరించిన నేమగును? నూనె పొంగి పొరలును. ఇట్లీ పద్యమర్థమగుటకు—కవి సమయములు దెలియవలెను ప్రస్తాన ప్రసిద్ధములైన యుపమానోపమానము లెఱుఁగవలెను. కళాదుని మర్మమును పసికట్టి యుండవలెను. "పుటము" వెట్టుట వైద్యశాస్త్రపు సరకు; ఇంత విషయ సమావేశమీ రచనలో నున్నది; ఇంకను ఊహించుకొలఁదియు వాసనలు గుబాళించుచుండును. ప్రబంధకవుల రచనామార్గమిట్టిది. వారు సాహిత్యవీరులు. పురాణకవులు కథ చెప్పికొనుచుబోదురు. అవసరమైనంత వరకే యుపస్కారకముల వాసన. ప్రబంధకవులట్లు గాదు. వారికి కథ, యముఖ్యము; రచనలో లోకకావ్య మర్యాదలన్నిటిని జూపింపవలెనను నాశ. అభినివేశము ప్రబంధములలో నిండుగా వస్తువు లేదే యనువాడు మల్లెతోటలో మిరియాలడుగు వెంగలి, అంతే. ఒక్కొక్క ప్రబంధకవికి గొన్నిటిపై బక్షపాత ముండును. పరిచయముండును ఆ కావ్యము జదివినపుడా కవి తన సర్వశక్తులతోఁ బ్రత్యక్షమగును.

---

1. ఆశాబంధః కుసుమ సదృశం ప్రాయశోహ్యంగనానాం।
సద్యఃపాతిప్రణయి హృదయం విప్రయోగేరుణాద్ధి
(మేఘసందేశము — కాళిదాసు)

మనుచరిత్ర ఱదువుచున్నామను కొనుఁడు. అందులో నమాత్యులకుఁగల సంగీత పరిచయము మనకగుపించును. "నిధి శాస్త్రము" తెలిసిన వాడనుకొందుము. ఆయుర్వేదమున ప్రవేశముండెనేమో యనిపించును. సంస్కృతములోని వైష్ణవ సాహిత్యము గమనించి యుండునేమో యని తోచును.[1] కన్నడ సాహిత్యములోఁ బరిచయముండి యుండునని యూహింతుము. గరిడీలు, కసరత్తులు, మల్ల యుద్ధములు మొదలైనవి గమనించిన వాడనిపించును. తానొక మండలాధీశ్వరుఁడగుటచే రాయలవారి వెంటనప్పుడప్పుడు వేటలకును వెళ్ళియుండును. ఆవాసన నిండుగా చతుర్థాశ్వాసములో గనుపించుచునే యున్నది. వ్యాకరణ శాస్త్రముతోడి పరిచయముండనే యున్నది. లేకున్న ప్రౌఢప్రయోగప్రసిద్ధి యేర్పడదు. ఇట్లే కొందరి కావ్యములు చదువుచున్నప్పుడు వారికి వేనివేనిలోఁ బ్రవేశమున్నదో మనకు స్పష్టముగ నగుపించుచుండును. తెనాలి రామకృష్ణుని గమనించినప్పుడు అతఁడు తార్కికుఁడై యుండునని యూహింతుము. తక్కిన శాస్త్రములలోఁ బాండిత్యములేదనికాదు; ఇదియాతని ఖురశీరంగమని, అట్లే సూరన్నగారి నధ్యయనము చేయుచున్నప్పుడు మీమాంసా శాస్త్రమర్యాదలక్కడక్కడ గనుపించును. ఈ దృష్టితో రామరాజభూషణుని జదివినచో నాతనికిఁగొన్నిటియందుఁదీవ్రమైన యభినివేశము, కొన్నిటితోడి పరిచయమున్నట్లు సులభముగా గ్రహింపవచ్చును. ముఖ్యముగా నాతనికి సంగీతములోఁ గాఢమైన యభినివేశమున్నది, అధికారమున్నది. అతఁడే తన్నుగూర్చి 'సంగీత కళారహస్య నిధి' నని చెప్పికొన్నాఁడు. అతనికాశ్రయ మిచ్చిన "రామరాయలు" నానాకళాపారీణుఁడు మంచి వైణికుఁడు గూడనట! "స్వరమేళ కళానిధి"ని రచించిన రామయామాత్యుఁడు వీరిర్వురి సమకాలికుఁడు. ఆ గ్రంథమున

---

1. రవి బింబపతన దీర్ణ పయోధిగర్భనిర్గత శేషఫణిఫణారత్న రుచియొ!
(మను 3-77)

చాళదినేళ బింబద నెఱల్ జలదోళ నెలసిత్తో, మేణ్, ఫణీం
ద్రాలయదిందమూర్ధ్వదఫణా మణిమంగళ రశ్మియో!
(పంపభారతము 1-96)

భట్టుమూర్తి చేయికొంత యున్నదేమో! నరసభూపాలీయమును రచించినది భట్టుమూర్తియే. మరి యాగ్రంథములో నెచ్చటను సంగీత వాసన లేదేమి? ఇది యొక ప్రశ్నయే. ఆ రచనా కాలము నాటికి, ఆతనికావిద్యలో నెక్కుడు పాండిత్య మబ్బియుండలేదేమో? కానప్పటికి సంగీత విద్యార్థిగానే యుండి యుండవచ్చును. వసుచరిత్ర రచన వేఱకు సాహిత్యమునకు సంగీతము విశం కటముగాఁ దోడ్తైనది. సంగీత సాహిత్య పరిపృక్తమైన ప్రత్యేక ధారాశుద్ధి యేర్పడినది. "ధారాశుద్ధి" యనగా మనలో నొక భావమున్నది; యతిప్రాస ములలోఁ కుంటు వడక తీగె దిగిచినట్లు సాగించు వద్దతిని సాధారణముగా ధారాశుద్ధి యందుము. ఈ దృష్టితోఁ దిక్కన గారిలో ధారాశుద్ధి కలదు. కాని, యిది సంగీతమునకుఁ బనికివచ్చునదిగాదు. నన్నయ్య గారిలో ధారా శుద్ధి యున్నది. వారిరచనలోఁ గూడ సంగీతపు జోడింపు దక్కువ; నన్నయ్య గారిదీ పద్యము—

సీ॥ చనుదెంచి యమ్మహా జనపతి జలమాడి
ఱింఛి యచ్చో విశ్రమించి చూచి
తత్కాలమున విలసత్కాల ఘనవల్లి
యన్నిష్ట సఖి నూడియున్నదాని
గురుకుచ యుగముపైఁ బరువడి దొరగెడు
కన్నీరు పూరించుచున్నదాని
తన సమీపమునకు జనులయాగమనంబు
పన్నుగా గోరుచు నున్నదాని

—పై దానిలో భారయమరినదని యంగీకరింతుము. కాని— యది తాళానుగుణమైనదిగాదు. మొదటఁజూపిన వసుచరిత్రలోని సీసపద్య ములు రెండింటియందును సలము లెక్కువ. అనగా నైదు మాత్రలతో నడ చునవి. దీనిని సంగీత పరిభాషలో 'ఖండగతి' యందురు. మొదటిపద్యమందు మూడుపాదములును నగముతోనే యారంభమగుచున్నవి. అచ్లే రెండవ పద్యము నందలి నాలుగవ పాదమున వరుసగా సలములే వచ్చినవి. ఐదైదు మాత్రలు చొప్పున మనము భాగించుకొని తాళము వేసినచో వాని పాదములు జంపె, రూపక, త్రిపుట తాళములలో దేనికైనను సరిపోవునా యనిపించును.

ఇట్టి పద్యములు వసుచరిత్రలోఁ గొన్ని పదులకుఁ జూపవచ్చును. ఒకే జాతికిఁ జెందిన గణములతోఁబాటు నడుమ నడుమ ప్రాసలు గూడ చేరినపుడు సంగీతమున కెంతయో యొద్దికగా నుండును. ఒక్క సీసపాదము లందు మాత్రమే గాదు. ఇతర ఛందస్సు లందు కూడ నిట్టి వక్కడక్కడ గనుపించును. ఈక్రింది వట్టివి.

.....మహికాంత! నిరంతర చింతనింతవిం
తనెగులు పోవనేల?... ... ...
... ...
ఏల యీ శాల యీ వేళ యీ విశాల
యవనికాభ్యంతరంబున కరిగెననఁగ (వసు-3 ఆ. 69 ప)

"వచ్చుగాకేమి యీ వసుమహిపాలు శా
లామనోభవుని నేలా తలంచె (వసు. 3 ఆ. 116 వ ప)

—పై వానిలో సాహిత్యప్రౌఢియే కాదు. సంగీత వాసనయుఁ గలదు. వానిని స్వరములలోనికి మార్చినపుడు యీ యందమర్థమగును. మరి కొన్ని విశేషములు జూపింతును. మను చరిత్రలోని యీ క్రింది పద్యమును గమనింపుఁడు:—

క॥ మృగమద సౌరభవిభవ
ద్విగుణిత ఘనసార సాంద్ర వీటీగంధ
స్థగితే తర పరిమళమై
మగువ వొలుపు దెలుపు నొక్క మారుత మొలసెన్॥

—పై పద్య మందలి నాలుగవ చరణమును మృదంగ పరిభాషలోనికి మార్చినపుడు "తకిట తకిట తకిట దీంత శాకిట తకతోం" అని కావచ్చును. సంగీత పరిజ్ఞానములేని వారికైనను-పై పాదమును జదివినప్పుడు యేదో సాహితీ మార్గభిన్నమైన యొక చమత్కారమున్నదనిపించుటలో నాశ్చర్యములేదు. వసుచరిత్రలో నీ ఛాయకుఁ జెందినదే పద్య మొక్కటి.

క॥ ఉద్ధతరిపు విద్ధతపన
పద్ధతి కరిభవన దవని పట దంబుధి సం
పద్ధరణ సముద్ధరణ స
మిద్ధరణ రజో వ్రజోద్య దిభమ దసృతికిన్॥

వచ్చును అట్లైనచో నేపద్యమును మార్చరాదు! కొందరు పద్యములను పైపై పద్యము నంతయు మృదంగ సాంకేతిక ధ్వనుల క్రింద మార్చి పాటలుగా పాడుట నేను విన్నాను; మరి కొందరు వాల్మీకి "మార్గ సంగీత మునకుఁ బ్రాణముపోయునట్లు రామాయణశ్లోకములను దాళమున కవక తవకగాఁ గుదించి పాడుదురు. అట్లే యే పద్యమునైన తాళమునకు యేదో యొక రీతి కుదింప వచ్చును గదా! చేయవచ్చును. కాని వచ్చిన కష్టమంతయు దానిని రక్తి కట్టించుటలోనే యున్నది. పైపై పద్యములో "సం పద్ధరణ, సముద్ధరణ, సమిద్ధరణ" అనుచోట మాత్రమే పుష్టిగా మృదంగ పరిభాష యున్నదనుచున్నాను. "తద్ధిత్తకిట, తద్ధిత్తకిట, తద్ధిత్తకిట" యని మూడుసార్లు పలుకుచున్నది. దీనికే ముక్తాయింపు అందురు. అది కడ పటనే రావలెను గదా! ఇది కేవలము సంగీత విషయము; ఎక్కడనో యొక చోట వచ్చినది. దానిని జూచి మనమానంద పడవలెను అంతే.

సీ॥ వలుద గుబ్బలు ప్రసేవకవృత్తి దగు గుబ్బ
కాయల కపరంజి చాయలొసఁగ
లలితాంగుళీదళంబులు సమేళములైన
సారలపై రాగ సంపదలిడ
పాణికంకణ రుతుల్ ప్రాణాను బంధమ్ము
గలతాళగతి కనుగ్రహము లీన
నాలాప భంగి యత్యుక్త సంవాది స
మ స్వరంబులకు గ్రామంబులునుప
తే॥ బ్రచర తానామృతముల మూర్ఛనలచేఁ న
చేతనంబులు చేతన రీతిఁదనరఁ
జేతనంబు లచేతన భాతి నొనర
వీణ వాయించు నొక యలివేణిగంటి॥

పై వద్యమందలి ప్రథమపాదము లోని మెఱుగులు సాహిత్యమునకు సంబంధించినవి. రెండవది సారెలను సవరించుట దెల్పుచున్నది; తక్కిన పద్యమంతయు సంగీత నిఘంటువు. పాణికంకణరుతులు-తాళగతి కనుగ్రహము లీనుచున్నవట! ప్రాణానుబంధ మనుమాట తాళమునకు సంబంధించినది. అఖండమైన కాలమును ఖండములుగాఁ జేసి ఆ ముక్కలను పొచ్చుతక్కువలులేకుండ నికరముగా నేర్పఱచి జోడించుటకే తాళమని పేరు. ఈ తాళములు మొదట నూట యెనిమిది. రాను రానైదు వందలకు పైఁగానైనవి. చిట్టాలు కట్టుటలో గొప్పవారైన ప్రాచీనులు భేదము కాని భేదములతో యెన్నో కొత్త తాళముల నేర్పఱచిరి. రఘునాథ నాయకుఁడు రామానంద తాళమని యొక్క దానిని వింగడించెను వీనిలో మరల 'మార్గదేశి' భేదములు. మార్గసంప్రదాయమునకుఁ జెందిన తాళము లైదు. ఈ తాళముల కుపాస్య దేవతలు, వాని యుపాసనాక్రమము, వీనిలోని రహస్యములుఁ చాలాకాలమివి విద్వాంసుల జయాపరాజయములకుఁ గారణములై యుండెడెడివి. ఛందస్సులో మాత్రలను మూఁడుగా, నాల్గుగా, ఐదుగా, యేడుగా వింగడించి గణములను గూర్చికొందుము; వీనికి త్రిశ్ర, చతురశ్ర, ఖండ, మిశ్రములని సంగీత లాక్షణికులు చేసికొన్న సంకేతము తొమ్మిది మాత్రలతో గూడ నొక గణమును వాకేశ్వరఅచు కొన్నారు. దానికి "సంకీర్ణ" మని పేరు. కాని యది గాయకులకే రుచింపక వదలివెట్టిరి. కాగా కొంత కాలమునకుఁ దాళములలో విప్లవము బయలు దేరినది. పాటలన్నిటికిని ఆధారమైనది గతి; దానిని చతురశ్ర, త్రిశ్ర, మిశ్ర, ఖండములు నాలుగే విధములని చాటి చెప్పిరి. ధ్రువ, మధ్య, రూపక, ఝంపె, త్రిపుట, ఆట, ఏక తాళములలో నీగతులన్నియు నణగియున్నవని యుద్ఘాటించిరి; వీనికి ప్రాతవైన ఆదితాళ మొకటి చేరినది; వీడు తాళములును, జాతిభేదములతో ముప్పది యైదుగా నైనవి. వీనికే "సూడా" ది తాళము లని పేరు. ఈ తాళము లన్నియు నొక్క పాటలో నణగి యుండునట్లు గొన్ని రచనలు ప్రాచీను లొనర్చినారు. సామాన్యులకు సులభముగా ప్రధాన తాళముల యొక్క యీ జ్ఞానమును గల్పించుటకై వీని రచనము. కాని యవి రక్తికి రాలేదు; తాళములకుఁ ప్రాణము లున్నవి. అవి పది. వీనికే దశప్రాణము లని పేరు. గ్రహములు ప్రధానముగా రెండు రీతులు. సమగ్రహము,

విషమ గ్రహము. సమగ్రహమనగా పాటయును, తాళమును ఒకే సారి యారంభించుట. త్యాగరాజుగారి హరికాంభోజి రాగములోని 'వినతాసుత' యను కృతి దీనికుదాహరణముగా జూపవచ్చును తాళమును గాని, పాటను గాని, మొదట నారంభించి రెండవ దానిని తరువాత మొదలు పెట్టుట విషమ గ్రహము. ఇది రెండు విధములు. అతీత గ్రహము, అనాగత గ్రహము అనాగతగ్రహమనఁగా దాళమారంభించిన పిమ్మట గొంత విశ్రాంతితోఁపాటను మొదలు పెట్టుట; దీనిని చోటు విడుచుట యందురు. ఒక అక్షర కాలము గాని రెండుగాని, మూడుగాని వదలి, యెత్తుకొనుట సామాన్యముగా సాధారణము. అతీత గ్రహమనఁగాఁ పాటను తాళము కంటె ముందారంభించుట. త్యాగరాజుగారి "వినాయకుని వలెను బ్రోవవే" అను మధ్యమావతి, యాది తాళములోని కృతి ఇందుకుదాహరణముగా వచ్చును. త్యాగరాజుని అను చోట 'త్యా' అనునది ముందటి తాళము యొక్క 'ఉసి' తోఁ జేరిపోవును. "గరాజు" తో తాళము యొక్క ఆవర్తమారంభ మగును. పిని యన్ని టికినిఁ దమిళములో "ఎడుప్పు" అని యందురు. పాటలోఁగూడ గ్రహ్యా స్వరములున్నవి. అవి పండితుల పాండిత్య విశేషమును దెలుపును. 'వేఱురాగ మేమో" యని వినువారిని మధ్యపెట్టును శంకరాభరణ రాగ మున్నదను కొందుము. దాని నొకడాలాపించు చున్నాఁడు అది ధీర శంకరాభరణ జన్యము. చతుశ్రుతి, రిషభ, అంతర గాంధార, శుద్ధమధ్యమ, చతుశ్రుతి ధైవత, కాకలీనిషాదములు దాని స్వరసంచారములు; రిషభమును షడ్జముగా జేసికొని-మొదటి శంకరా భరణములోని రాగ స్వరములనే పాడినపుడు అది "ఖరహర ప్రియ" గా మారును. గాంధారమును షడ్జముగాఁ జేసికొనిపాడిన "తోడి" యగును. ఇట్లు ఒక్కొక్క రాగములో నేదేని యొక్క స్వరమును షడ్జమును జేసికొని మొదటి రాగస్వరములనే పాడిన వేరు రాగమని భ్రాంతి కలుగును. ఇటు పాడునపుడు గ్రహభేదముచే వచ్చిన రాగమును బ్రస్తరించు చున్నను మొదటి రాగమును మరువకపాడవలెను. ఇది పండితులసామర్థ్యము. ప్రస్తుతము మనకుఁ గావలసినవి, తాళమునకు సంబంధించిన గ్రహవిశేషములే. ఇక రాగాలాపన విషయము. స్వరములు నాల్గురీతులు. వాది సంవాది వివాద్యనువాదులు. ఒక రాగ సంచారమునందు వాది రాజువలె స్వేచ్ఛా విహారము చేయును. సంవాది దాని కమాత్యుఁడగును. వివాది శత్రు

స్వరము. రాజు వెడలి నప్పుడంతయు రౌతు వెడలి తీరును గదా! అందుచే ననువాద స్వరము వాది వెంటనే యుండును. ఇక సమస్వరమనఁగా నేమి? వదలి వెట్టఁదగనిదన్నమాట అనఁగా మిత్రస్వరము. ఈ పద్ధతి ననుసరించియే గ్రామములుండును. గ్రామమనఁగా స్వరసమూహము; వానిరాకపోకలు; వీనిలో నంతర్భాగములే మూర్ఛనలు; గ్రామములు మూఁడు రీతులు-షడ్జ గ్రామము, మధ్యమ గ్రామము, గాంధార గ్రామము. గాంధార గ్రామము మానవలోకములో లేదన్న మాట. షడ్జ, మధ్యమ గ్రామసంచారములు మాత్రమే యున్నవి సప్త స్వరముల యొక్క ఆరోహణ-అవరోహణమునకు మూర్ఛన అనిపేరు. అట్టి మూర్ఛన లేడుచేరి-యొక గ్రామము. గ్రామ మొక్కటికేడేసి మూర్ఛనల చొప్పున పదునాలుగు మూర్ఛనలున్నవి ఇక తానము, ఇది మధ్యమ కాలములో నడచును రాగములో దీనిని ప్రధా నాంగమని చెప్పవచ్చును. దీనికి ముందంతయు నాలాపనం చౌక కాలములో నడచుట పరిపాటి. అందుచే మధ్యమ కాలములో నడచు తాన సంచారము వచ్చినంతనే మనశరీరములో ప్రాణ స్పందనము కలుగును ఇందులో రాగ ముస కంగముగాఁ గొంత తాళముగూడ నడచును. ఎక్కడైనను "న్యాస" మొనర్చినపుడు దాని చుట్టును కొంత మంద సంచారములుసాఁగును. తానము నందు "తానమ్‌త" "తాన్న" "తానమ్‌న" యీ పదములు వాడవలెనని నియమము. తాళా వర్తములు పూర్తిగాకున్నను అక్కడక్కడ వానిసంచా రములు గనిపించును. గతిభేదములతో నెన్నో తాళ విశేషములు గూడఁజూపు దురు. ఇవన్నియు ముఖ్యముగ వీణలోఁ జూపుకై వాడములు; విద్వాంసులు వీణలపై త్రికాల తానములను గూడ వాయింతురు. ద్రుతకాల తాళము నకు "ఘన" మని పేరు. ఈతానము లెనిమిది విధములు. గజతానము అశ్వ తానము-మయూరతానము-కుక్కుటతానము-మండూకతానము మొదలైనవి. వాని పేరులే తద్గతి విశేషములను దెల్పుచున్నవిగదా? ఇట్లుమధ్యకాలములో తాళసాహ్యముచే నడచునది తానము. అందుకే యచేతనములు- చేతములైన వనుచున్నాఁడు. మూర్ఛనలు మందసంచారములు గలవి. వానిలోఁ జేతన ము లచేతనములైనవి. కనులు మూసికొని నిశ్చలముగా హాయిగా వింద మని పించునని భావము.

గీ॥ గంధగజయాన గీత ప్రబంధ కలన
నలరి యతితీయమై వచ్చు నరిది, మగువ
లార! కనుగొంటిరే! యను నాళివాక్య
మొకటి వినవైన_నిదెవేళ మొగవెనుచు॥

ఇందులోని "ప్రబంధ" శబ్దము "మాతువు" నకు సంబంధించినది. గీతికా సామాన్య నామము. ప్రబంధభేదములు బోలెడు. 'యతి' శబ్దము— సంగీత సంబంధి. తాళదశ ప్రాణములలో నిదియొకటి. ఒక రీతిగా(జూచినచో తాళమునందు వచ్చు నంగముల యొక్క క్రమ విన్యాసమునకే 'యతి' యని పేరు. అది యాఱు రీతులు. సమ, గోపుచ్ఛ స్రోతోవహాములు. డమరు మృదంగ విషమములు. సమజాతులైన యంగములే వచ్చుటకు "సమయతి" యనిపేరు. "స రి గ రి-గ మ ప మ" మొదలైనవి. అంగముల యొక్క-విలువ మొదలు చాల అతురకాలముల విలువగా నుండి క్రమముగా దగ్గుచువచ్చినచో గోపుచ్ఛయతి—

ప ని ద ప మ
ని ద ప మ
ద ప మ
ప మ
మ

— దీని స్వరూప మును సాహిత్యములో(జూపినమీ కనుకూలముగ నుండుననుకొందును.

త్యాగరాజయోగవైభవం	అగ. (ఉసి)
అగరాజయోగవైభవం	దె. పా
రాజయోగవైభవం	గ (మొదలు)
యోగవైభవం	(ఇ ఇ)
వైభవం	
భవం	
వం	

ఇట్టిదే మరి యొకటి.

సా రి స ప దే
రి స ప దే
స ప దే
ప దే

త్రోతోవహా యతి యనఁగా-మొదట సన్నముగా నుండి రానురాను వెడల్పై
తడకు వచ్చునరికి ఎక్కువ విస్తీర్ణము గలది.

రి స
మ రి స
ప మ రి స
ద ప మ రి స
ని ద ప మ రి స
స ని ద ప మ రి స

సాహిత్యము నిట్టి దొకటి.

స ం
ప్ర కా శ ం
స్వ రూ ప ప్ర కా శ ం
త త్వ స్వ రూ ప ప్ర కా శ ం
స క ల త త్వ స్వ రూ ప ప్ర కా శ ం
శివ శక్త్యాది స క ల త త్వ స్వ రూ ప ప్ర కా శ ం॥

ఇట్లే డమరు యతి మొదలగునవి.

మ॥ పదమెత్తం గలహంసలీల-యధరస్పందంబు సేయన్ సుధా
స్పదమౌ రాగ కదంబకంబు-శ్రుతి జూపన్ శ్రీనివాసంబు, కే
ల్గదలింపన్ సుకుమారపల్లవ నవై లాలక్ష్మి, వీక్షింప ప
ట్టుదియుంబొల్పు, దరంబె కన్నెగొనియాడన్ గేయవాక్కౌధిమన్॥

పదమెత్తిన తోడనే కలహంసలీలయట! కలహంస- యని యొక
రాగమున్నది. ఒక గీతికా ఖేదము గూడగలదు. వెదవి గదలించినచో-రాగ

మాలికలు బయలుదేరును. కృతిజూపినచో - శ్రీరాగవిలాసము కన్పించును. శ్రీరాగము చాల ప్రాచీనమైనది. ఘన రాగములలో నొకటి. చేయిచాచినచో సుకుమారములైన పల్లవములు-చరణముల గల యేల పాటలు దోచును. నేను జూచినంతవరకు అన్నమయ్య గారి యేలపద మొక్కటి దొరికినది. పట్పది గూడ ప్రబంధ నిర్మాణములో నొకటి. ఇవన్నియుసంగీతశాస్త్రములోని విశేషములే.

నాదంబొక్కటి పిక్కటిల్లె దిశల న్నవ్యామృతా వ్యాహతా
స్వాదంబై వినయయ్యెడిం ప్రియవయస్యా! వింటివే! షట్పదీ
నాదంబో! కలకంఠనాదమొ! మరున్నారీమణీ వల్లకీ
నాదంబో! వివరింపరాక పరమానందాను సంధానమై॥

పై పద్యమును బదువుచున్నప్పుడు విక్రమోర్వశీయములోని—

మత్తానాం కుసుమరసేన షట్పదానాం
శబ్దోయం పరభృత నాద ఏషధీరః
ఆకాశే సురగణ సేవితా సమంతాత్
కింనార్యః కలమధురాక్షరం ప్రగీతాః॥

అనుశ్లోకము జ్ఞాపకమువచ్చుచున్నది. రామరాజభూషణుని పద్యము దానికి ప్రతిబింబమగునేమో! ఇట్టివే మరికొన్ని సంగీతవిశేషములు వసుచరిత్ర యందు బరిఢించు కొలదియు దొఱకునని నా యూహ. కొన్ని యింతకు ముందు నా "వసుచరిత్ర సాహితీ సౌరభము" నందు వివరించినాను. మరల నిచ్చటవానిని దడవుట చర్వితచర్వణమగును. నా కసమ్మతముగూడ. వసుచరిత్రకు జక్కని వ్యాఖ్యానము వ్రాయవలెనను కుతూహలము గలదు. డా॥ బెజవాడగోపాలరెడ్డిగారు సహృదయ శిరోమణి, రసికులు, రామానుజరావుగారన్నివిధముల సమర్థులు. వారి యౌదార్యము వీరి పట్టుదల నాతో నీ పనినిఁ జేయించునేమో దెలియదు.

వసుచరిత్ర కవితా విపంచి

శ్రీ యస్. రాజన్న కవి

నదీమతల్లులకు నారీత్వమును ప్రసాదించి "రసోదంచిత చమత్క్రియా కల్పనాకల్ప భవ్యమ్ముగా" వసుచరిత్ర మహాప్రబంధమును సృష్టించి సరిగమల మధురిమలు చిలికించిన కవి మూర్ధన్యుడు రామరాజు భూషణుడు.

ప్రబంధ కవులందరు సమకూర్చిన అలంకారములన్నియు ఒకఎత్తు! తన సంగీతశాస్త్ర పరిష్కృతమైన ధారాశుద్ధితో నిర్వక్రప్రౌఢితో వాగ్వైచిత్రితో "జీవన మెల్ల సత్కవి నిషేవితము, విశ్వధాత్రీ వలయ త్రికాల ఫలదోకము, ముక్తావళి విభ్రమాస్పదము, అయిన 'కవితా విపంచిని' మీటి "అచేతనమ్ములు చేతన రీతి దనర, చేతనమ్ము లచేతనభాతి నొనర' అపూర్వ కవితా శిల్పముతో భూషణుడు సంతరించిన సౌందర్య శోభ ఒక యెత్తు!!

రామరాజ భూషణుడు [1]సంగీత కళారహస్య నిధి. పద్య రచనా సామ్రాజ్య పట్టాభిక్తుడు. అంతేకాదు బహు విషయ విజ్ఞాత. సంస్కృతాంధ్ర సకల భాషా సామ్రాజ్య సర్వంకషమైన పరిశ్రమ చేసి ఈ మహాకవి సంపాదించిన శక్తులు ఆనన్య సామాన్యము.

సంగీత పాండిత్యములు ఇంత సమానముగ కడుపారశ్రావి పెరిగిన కవికిశోరము ప్రబంధ యుగములో మరొకరు అగుపించరు. సంగీత సాహిత్యములు శారదాదేవి స్తన ద్వయముగా ఉపవర్ణించి అలఘు ప్రస్తారములుచేసి (1-శి) తన సంగీత సర్వకళా ప్రావీణ్యమును ప్రకటించు కొన్నాడు. ఆయన కవిత చదువగానే మొదలు శ్రవణానందము కలిగి, పిదప తేనెసోనట్లు

---

1 గీతము = పాట: సంగీతము = జంత్రగాత్ర నృత్యసమ్మేళనము.

వసుచరిత్ర కవితా విపంచి

రుచిచూపి, తర్వాత హృదయకుహరములోప్రవేశించి మనస్సునకుఅవ్యక్తమైన ఆనందము అందించునట. (2–14) నిజముగా ఆ మహాకవి కవితాధార సంగీత సుధాధార!!

వసంతకాలము వచ్చినది. మూర్తి కవి రాగమాలికలో సంగీత 'కచ్చేరి' ప్రారంభించినాడు.

"లలనా జనాపాంగ వలనావసదవంగ
తులనాఖికాభంగ దోఃప్రసంగ
మలసానిలవిలోల దళసాసవరసాల
ఫలసాదర శుకాల పన విశాల
మలినీ గరుద నీక మలినీ, కృతధునీ క
మలినీ సుఖితకోక కులవధూక
మతికాంత సలతాంత లతికాంతర నితాంత
రతికాంత రణతాంత సుతను కాంత
మకృత కామోద కురవకా వికల వకుల
ముకుల సకల వనాంత ప్రమోదచలిత
కలిత కలకంత కులకంత కాకలీ వి
భాసురము వొల్చు మధుమాస వాసరమ్ము" (1-116)

సంగీత జ్ఞానము ఉన్నవారు, లేనివారు కూడ పై పద్యము చదువు చున్నప్పుడు మనస్సులు పరవశించి, శిరస్సుల నూపవలసినదే! పాఠకునకు హృదయముండవలెనంతే! పై పద్యము ఆపాత మధురము, ఆలోచనా మృతము. భట్టుమూర్తిని సంగీత విద్వాంసుడుగా చెప్పుటకు ఈ పద్యము కాలము. మరియు

"ఆ లావణ్య వతీమణుల్ కొలువగా, నాలేమ యా కోనలో
నాలీలా భవనమ్ములో, ననఘ కంఠాలాప్తి సౌభాగ్యముల్
వ్యాలోలాంగుళి సంజ్ఞ చేఁ గలుపు తేవన్ వీణఁ బల్కించు, నా
యాలాపంబె గిరీదరీ ముఖరమై యాలింపగా నయ్యెడిన్"

అల్లే నాళీకాకరతీరసార కదళీ నారంగ పూగావళీ (2-29) వంటి పద్యములలో కవి రాగం-తానం-పల్లవి వీణలో పల్కించి, సర్వేంద్రియ మోహనమై, నియతికృత, నియమరహిత, హ్లాదసుధాభాజనమైన ఆనంద తత్త్వమును ప్రసాదించినాడు. "కంఠాలప్తి" "తేవన్ వీణ బల్కించు" శబ్దములు మృదంగ వరుసలలోని ముక్తాయింపు ధ్వనులను ఆలపించుచున్నవి.

"తత నితంబా భోగ ధవళాంశుకములోని
యంగ దట్టపుఁగావి రంగు వలన
శికాంత మణిపీఠి జాజు వారఁగ గాయ
లు త్తంగ కుచపాళి నత్తమిల్లఁ
దరుణాంగుళీ ధూత తంత్రీ స్వనంబుతో
జిలిబిలి పాట ముద్దులు నటింప,
నాలాప గతిజొక్క యరమోడ్పుఁ గనుదోయి
రతిపారవశ్య విభ్రమము దెలుఁప
బ్రౌఢిఁ బలికింప గీతప్రబంధములకుఁ
గ్రమ కరపంకరువా రత్నకటక ఝణఝు
ణధ్వని స్ఫూర్తి తాళమానములు గొలుప
నింపు దళుకొత్త వీణవాయించు చుండె" (మ. 2-27)

పై పద్యమున వరూధిని "ఇంపుతళు కొత్త వీణవాయించి" తన ఆలాపనకు తానే పరవశించిన తన్మయ హృదయ. గిరిక అట్లుకాదు. తన వీణా వాదనతో ఎదుటి వారిని కూడ రంజింప జేయు సర్వకళా స్వరూపిణి. ఆమె వీణవాయించుటే కాదు- పల్కించును కూడ!

మను చరిత్రలో పెద్దన్నగారు కూడ వరూధినీ గృహమును వర్ణించుచోట

"తావుల్ క్రేవలఁ జల్లు చెంగలువ కేదారంబు తీరంబునన్
మావుల్ క్రోవులు నల్లి బిల్లిగొను కాంతారమ్ము నండైందవ
గ్రావాకల్పిత కాయమాన జటిలద్రాక్షా గుళుచ్ఛంబులన్
బూవుండీవెలనొప్పు నొక్క భవనమ్మున్ గారుడోత్కీర్ణమున్

అనుపద్యములో "ముఖారి"రాగచ్ఛాయలతో ,,శానం"మాత్ర మేపల్కించెను.

"ఆ జాబిల్లి వెలుంగు వెల్లికల డాయన్ లేక, రాకానిశా
రాజశ్రీ సఖమైన మోమునఁ బటాగ్రంబొత్తి, యొల్లెత్తి, యా
రాజీవానన యేఁచ్చోఁ గిన్నర వధూ రాజత్క రాంభోజ కాం
భోజీ మేళవిపంచి కారవ సుధాపూరంబు లోరంబుగన్ (4-52)

కాంభోజీ రాగము మార్దవవైన్య భావములనుప్రకటించును. ఈ రాగభావమును పై పద్యములో చక్కగా వ్యక్తము చేసినాడు. ఇందులో రాజశ్రీ సఖమైన మోము, రాజీవానన శబ్దవిశేషములు పరస్పర విరుద్ధములు. ఇచ్చోట రస్య ఆజీవః రాజీవః అనుగ్రహముతో రాజీవశబ్దమును సమర్థించిఅర్థ పుష్టిచేకూర్చినాడు. ఈ పద్యమున మాటిమాటికి అంబుజ శబ్దము వాడి అటు చంద్రుని, ఇటుగిరికను గోడుగోడున ఏడ్పించి వినోదించినాడు కవి.

భట్టుమూర్తి భారాశుద్ధి సంగీతశాస్త్ర పరిష్కృతమైన దని ముందే మనవి చేసినాను. కేవలము పదముల మధ్య విశ్లేషము లేకుండ చెప్పుటయే పెద్ద నాదుల భాశుద్ధి. మను చరిత్రలోని ఈ పద్యము వినండి!

"వాలారుంగొన గోళ్ళ నీ వలసతన్ వాయించుచో, నాట కుం
మేళంబైన విపంచి నిన్న మొదలున్ నీవంటమి జేసి, యా
యాలాపంబె యవేళఁ బల్కెడు, ప్రభాతాయాత వాతాహతా
లోలత్తంత్రుల మేళవింపగదవే! లోలాక్షి! దేవాక్షికిన్॥ (మ. 3-57)

నాట రాగము పగలు మూడవ జామున, దేశాక్షి ప్రాతఃకాలమున పాడదగిన వని భావము. ఇందులో ఒక్కొక్క రాగమునకు ఒక్కొక్కశ్రుతి చేసి వాయించుట మనకు అర్థమగును. కాని ఆయా రాగములకు అనుకూలముగ స్వర ప్రస్థానములు సమకూర్చి వాయించుట సహజ స్థితికాదు. ఈ పద్యమున వరూధిని సాయం సమయమున నాటరాగమునకు వీణపై సర్వ ప్రస్థానములు మెట్ల సహాయమున సవరించి పెట్టి వాయించినది. అంత విరహ తాపమును భరించలేక వెళ్ళిపోయినది. ఇంతలో తెల్ల వారినది. ఉదయము ప్రభాతమారుతము ఆ వీణా తంత్రులకు సోకుటచేత నాటరాగమే "అవేళ"

పల్కుచున్నట్లు చెప్పబడినది. అట్లైన ఒక రాగమునకు నిర్ణయించిన స్వర శ్రుతులు మెట్ల సహాయమున వీణపై సవరించి, ఆ తర్వాత 'వీవన' తో విసరినప్పుడు కూడ ఆ రాగము ధ్వనించ వలెకదా! కాని అట్లు ధ్వనించదు. పెద్దనగారి ఈ భావము కల్పనా జనితమైన చమత్కారమే కాని, సంగీత శాస్త్ర సమ్మతము కాదు, అనుభవ సిద్ధమును కాదు.

మూర్తికవి సంగీత రచనలో అట్టి సందేహములకు అవకాశము లేదు. ఇతడు సంగీత శాస్త్రమును ఆపోశనము పట్టిన వాగ్గేయకారుడు.

"అరిగా పంచమ మేవగించి నవలాలవ్వేళ[1] హిందోళవై
ఖరిఁబూనన్ బికజాత మాత్మరవ భంగ వ్యాకులంబై, వనీ
ధర నాలంబిత పల్లవవ్రత విధుల్ దాల్పన్, తదీయ ధ్వనిన్
సరిగా గైకొనిడెన్[2] వసంతము మహాసంపూర్ణ భావోన్నతిన్॥ (1–10)

వసంత రాగము ప్రాతఃకాలమున ప్రథమ యామమున పాడదగినది. భట్టుమూర్తి కాలము నాటికి ఇది సంపూర్ణ రాగము. నేడు వాడుకలోనున్న వసంతరాగమునకు "పంచమ" స్వరములేదు. "స్యాద్వసంతోల్పంచమ" అను సూక్తి సంగీత శాస్త్రములో చెప్పబడినది. అంటే "వసంతకు" అల్పపంచమ సంచారమున్న దన్న మాటేకదా! ఈ "టెక్నిక్" పద్యములో ఎంత చక్కగా ఇమిడ్చినాడో రసజ్ఞులు గ్రహించవలె. పద్యములోని పల్లవ శబ్దమును పత్ + లవము అని విడదీసిన లవమైన "ప" కారము ధ్వనించును. "తపరస్తత్కాలస్య" సూత్రము వలన హ్రస్వపంచమము మాత్రమే మిగులును. ఈ రహస్యము ముందు ముందు పద్యములలో మృదు షడ్జము, మృదు పంచమము (2–17) అను ప్రయోగము వలన బట్టబయ

---

1. "శిశిరస్య వసంతస్య సంధౌ హిందోళ రాగకః

2. వసంత: స గ మ ధ ని స—స ని ధ మ గ రి స
హిందోళ: స గ మ ధ ని స— స ని ధ మ గ స
(హిందోళ నుండి వసంత ఆవిర్భవించింది)

లైనది. "పత్ + లవము" అనగా పాదలేశము, లేదా పాదాగ్రము. దీనిని బట్టి కోయిలలు వసంతకాలము వచ్చినంతవరకు బోటనవ్రేలిమీద నిల్చి తపస్సు చేసినట్లు భావించవచ్చును.

"అకుటిల సౌమ్యమాన నిలయస్ఫురణంబును, నాతిమాత్రతా
రక పరివర్తనంబు, శుభరాగ మిళత్పద పల్ల వాంకము
ద్రికయును, బెంపుమీర నిజదృష్టులఁ బోలిన సింధుకన్యకా
ప్రకట వివాహగీతికలు పాడిరి పుణ్య పురంధ్రి కామణుల్"
(5—71)

పుణ్య పురంధ్రికామణులు సింధు కన్యకా ప్రకట వివాహ గీతికలు [1]నైంధవి రాగములో పాడుటలో ఔచిత్యమున్నది. (సింధుకన్యక = నైంధవి = లక్ష్మి) ఈ రాగమునకు తారస్థాయిలో సంచారములేదు. 'ని' లయస్ఫూర్తితోనే ఆగిపోవును. దీనికి తారక "ప-రి" వర్తనములేదు. అంచే తారస్థాయిలో పంచమ-రిషభ సంచారము లేదు. [2]"సౌమ్యమాన" అనుచోట శుద్ధమధ్యమమే కాని, ప్రతి మధ్యమము లేదని మొత్తము నైంధవి రాగలక్షణమును చెప్పినాడు. వివాహగీతిక అనుచోట "క" ప్రత్యయము అల్పార్థములో వాడి, నైంధవి రాగము జన్యరాగమని కూడ సూచించు చున్నాడు

ఇందులో ఇంకొక విశేషమున్నది. "అకుటిల సౌమ్యమాన" అను సమాసము వాడినాడు. లక్ష్మికి తమ్ముడు సోముడు. ఇతనికి లయమున్నది. (అమావాస్య) వక్రతము కలదు. అంచే కుటిల స్వరూపుడు (లక్ష్మి సోమ సంబంధి భ్రాతృత్వము కలది) అభ్రాతృకమైన కన్యను వివాహమాడుట ప్రశస్తము కాదు. ఇది ధర్మశాస్త్రనిర్ణయము. గిరిక తమ్ముడు వసుపదుడు.

---

1. నైంధవి = ని ధ ని స రి గ మ ప ద ని-ద ప మ గ రి స ని ధ ని స.
(ఖరహర ప్రియ జన్యరాగము)

2. సౌమ్య + మ + అన = శుద్ధ మధ్యమ స్వరము ప్రాణముగా గలది నైంధవి.

ఇతడు అకుటిలమైన వంశములో జన్మించెను. సౌమ్య స్వభావము కలవాడు. కావున గిరిక లక్ష్మీకంటె ఉత్తములాలు. లక్ష్మి నీచ గామిని కూడ, గిరిక "మాననిలయ".

చందన గంధులు (1–105), పగడపు జిట్టలన్ (1–114), ఒక కాయ నవపాయ (2–7), వైణిక వల్లక శ్రేణి (5–69). మొదలగు పద్యములలో-గాన ప్రభావమున చేతనము లచేతనములగుట, జగదభివంద్యమైన గాన రస సంగతిచేత కన్నుల నుండి ఆనంద కాష్పములు రాలుట; సకలయంత్ర గాత్ర వాద్యముల బృందగాన మాధుర్యమును-మనోజ్ఞముగ వర్ణించివాడు.

షష్ఠ్యంతములలోని

ఉద్ధతరిపు విద్ధతపన
పద్ధతి కరి భవన దవని పటదంబుధి సం
వర్ధరణ సముద్ధరణ స
మిద్ధరణ – రజోద్రిభోద్యదిభ మద సృతికిన్ (1–89)

ఈ పద్యమున

తద్ధి తకిట, తద్ధితద్ధుణు
తద్ధిరుతకు, తకిట దికిట తకతోంకిట, ఝాం
కు త్తద్ధుణు, కకుంతద్ధుణు, కు
కూంత దిరు, తతోంత కూంత తకుత దిగిణతోం.

అను మృదంగ "తక్కార" వాద్య ధ్వని ఎంత మనోహరముగ "ఆదితాళ" లయ ప్రధానముగ వ్యక్తము చేసెనో సహృదయైక వేద్యము.

శబ్దాంలంకార రచనా కౌశలము భూషణకవికి సహజభూషణము. ఈ క్రింది పద్యములలో కవితాభావ గాంభీర్య లోపము గాని, వ్యర్థ పదము గాని కన్పించదు.

"ఒకకాయ నవపాయ (2–7), ఇమ్మైవై మరుమాజారమ్ములవై (1–141), ఈరాల బోరాదు (2–58), ఆలరు ప్రాయము వాని (3–46),

పరమానవ (8-118) -ఇట్టి అను ప్రాసాద్యంత నియమములు గల పద్యములు వసుచరిత్రలో కోకొల్లలు. అవసరమైనప్పుడు ధీర్ఘ సమాసములు వాడినప్పటికి అందులో శ్రవణ సుభగత్వ ముండును. శబ్దములు అర్థము కాకపోయినా తంత్రీనాదము వలె పాఠకునకు హాయి కలిగించును. పై పద్యములు భావానుగుణ్యమైన రాగములను తోడించి, స్వర సంచారము చేసి, స్వరరాగ సుధారసమును పంచిపెట్ట వచ్చును.

వసుచరిత్ర చమత్కారముల పుట్ట. గిరికా వసురాజులకు వివాహమైనది. లక్ష్మీనారాయణుల వలె, రతీమన్మథుల వలె ప్రకాశించుచున్న వారి దాంపత్యసుఖమును కవి దివ్యదృష్టితో చూచి వర్ణించెను.

"సతి సాహిత్య రహస్య మిళువలనన్ సాధించి, తోడ్తోనఁద
త్పతికిన్ ప్రత్యుపదేశమిచ్చె-నతుల ప్రౌఢిన్, ధ్వని వ్యక్తిఁద
ప్పుచితికిన్ జొన్పుచు, లోచనాంజన రస ప్రోన్మేషము ల్తన్మిళో
ద్గతము ల్సేయుచుఁ ప్రత్యలంకరణ మౌఖర్యమ్ము దీపింపగన్. (8-94)

గిరికా వసురాజులకు పార్వతీ పరమేశ్వరులకు అభేద ప్రతిపత్తి పాదుకొల్పి, శ్లేషసహాయమున నాయికానాయకులకు ఒక పవిత్రత కల్పించినాడు కవి. అంతేకాదు; వసుచరిత్ర రచనలోని తన పాండిత్య ప్రతిభా విశేషములకు చక్కని నిర్వచనము పై పద్యము ద్వారా దృష్టాంతీకరించెను.

...

పరమేశ్వర కారుణ్య కటాక్ష లబ్ధమైన సాహిత్య రహస్యములను సాధించి, పాఠప్రవచనములు నిర్వహించు సామర్థ్యమును పొంది, ధ్వని మర్యాదను పాటించి, అలంకార ఆడంబరమును ప్రగహించి-కేవలము "లోచనము" లో కాక "అంజనము" వేసి చూడగల్గిన "అతుల ప్రౌఢు" లకు తప్ప తదన్యులకు-శుష్క-తర్క బుద్ధులకు వసుచరిత్ర అర్థము కాదని తొమ్మువిరిచి చెప్పుకున్నాడు.

ఇందులో మరొక పరమ రహస్యమును ప్రామాణికముగ విన్నవించెను. "ధ్వని-లోచనము" అను రెండు పదములు తన ప్రతిభకు మారుగా వాడినాడు. ధ్వన్యా లోకము అలంకార శాస్త్రము. దీనికర్త ఆనందవర్ధ

నుడు. ఈ శాస్త్రమునకు అభినవగుప్తుడు "లోచన" మను వాఖ్యానమును రచించెను. భూషణకవి కూడ నరసభూపాలీయమును ప్రాసిన లాక్షణికుడు. ఇన్ని విషములు పై పద్యములో గుప్తము చేసినాడు.

గిరిక విరహబాధ అనుభవించుచున్నది. చెలికత్తెలు మన్మథ పూజ చేయుచున్నారు. ఆ మన్మథ పూజా వర్ణనలోని శబ్దసౌందర్యము అపూర్వము. ధ్యానము, అవాహనము, అర్ఘ్యపాద్యము, అభిషేకము, పుష్పోపహారము, చందన చర్చ, భూపదీప నైవేద్యములు- ఈషోడశోపచారములు మన్మథునికి అవసరము లేదట. ఎందుచేత? ఆ మన్మథుడు హృదయ వాస్తవ్యకుటుంబి, జగద్వ్యాపకుడు, నారాయణప్రియసూతి - మొదలైన విశేషశక్తి సంపన్నుడు గనుక. అందుకై "మధురస ఫలోపహారమును" భక్తితో సమర్పించి "మాన మథనాయ, "మదనాయ, మధుసఖాయ, మనసిజాయనమో! నమో!"అనుచు, ప్రొక్కిరి. ఒకే అక్షరమును మాటి మాటికి ఉచ్చరించు మంత్ర సంప్రదాయము నెరిగిన కవి కావున "మ" కారములచ్చే పల్కించెను. అచ్చె "కామ! కమలాస్త్ర! కమలాకాముక సుత! కామకనీయక నిధీ!" అంటూ ప్రార్థన సాగించెను.

మొదటి పద్యములో "మ" లక్ష్మీబీజము. రెండవ పద్యములో "క" విష్ణుబీజము. కాముడు లక్ష్మీనారాయణుల ప్రియపుత్రుడు కదా! అసలు గిరికకుకావలసినది కళ్యాణము. అందుకే "మ" కారజపముచేయించెను. పరిణత వాక్కు గల భూషణకవి ఇట్టి సంప్రదాయ శబ్ద శ్లిష్టత ప్రతి పద్యములోను చెప్పక చెప్పినాడు.

పంచమా శ్వాసమున ఇంద్రుడు సృష్టించిన మహా నగరములో కురంగములు తురంగములుగా (5-43) మారుట అరదములు శరదములుగా (5-44) నగుట వాఖ్యలోనిదే!

"గిరివర ఘోర కందరల కేవల వన్య గజైక వృత్తిచేఁ
దరలక యున్న సత్కృతము తప్పునే! అప్పురి కేసరుల్ నృకే
సరులయి, పూర్ణ పౌరుష విశాలత, మించె మహానృకేసరిం
పరునకు మార్మ్రొగంబిడమి, భక్తునిఁ బ్రోవ సటల్ఘటింపమిన్.

(5-45)

ఇక్కడ కేసరులు నృకేసరులైనవట. ఈ జన్మ ఎట్లు సిద్ధించినది? వన్యగతైక వృత్తి వలన సిద్ధించినదట (వనీ + అగజ) పార్వతిని సేవించుట వలన ఉత్తర జన్మ ప్రాప్తించినది. పార్వతి వాహనము సింహమేకదా! ఇది సహజ స్థితి. ఆ సంస్కృతము చేత సంపూర్ణ పురుషత్వము వచ్చినది. పూర్ణ పౌరుష విశాలతతో నృసింహస్వామిని మించి పోయినవట. ఇట్టి శిల్పమూర్తి సార్థక పదప్రయోగ ప్రాగల్భ్యము అనితర సాధ్యము. అతడు చిత్రవిగ్రహ విశంకటుడుగదా!

"కమలాభర్త భవద్విరోధివై చక్రంబున్ ప్రయోగింప (4-81) అను పద్యములో రాహువు చంద్రుని క్రమింగబోవుట, చక్రధారణ ప్రధాన విషయములు. ఇక్కడ విరోధి శబ్దము సాభిప్రాయముగ వాడినాడు. (వి - ఆకాశము; రోధి - అడ్డగించువాడు) రాహువు ఆకాశమార్గమున చంద్రుని అడ్డగించువాడు కదా! అట్లే "చంద్రదినేంద్ర విరోధి" అని మరొక చోట వాడినాడు.

వసురాజు తన కేళికైలమైన కోలాహల పర్వతమునైన పుష్పోద్యానవనములో తిరుగుచుండెను. ఇంతలో ఒకమధుర సంగీతమువినవచ్చినది.

"నానా గాయన గాయనీ మణుల గానంబుర్వి నాలింపమో
నానాటన్ నగభేది వీటగల గంధర్వాప్సరోగీత వి
ద్యా నైపుణ్యము లెన్నియేని వినమో! యందైన, నిందైన విం
దై నాదంబొన గూర్చునే మదికి నిట్లానంద సందోహమున్. (2-16)

అట్టి అవ్యక్త మధురమైన అపూర్వమైన గానము విన్నాడు. వసురాజు ఆజ్ఞమేరకు నర్మసచివుడు వెళ్ళి

"తరువుల పొంతపొంచి వసుధావర మిత్రుడు గాంచె నచ్చటన్
దరుణిఁ, దమోవినీలకచఁ దామర సోదర సోదర ప్రభన్
దరళ విలోచనన్ తతనితంబఁ దటిన్నిభగాత్ర వల్లరిన్
దరుణ శశాంక ఫాల, నొక తన్విఁ, దరంగ వళిం, దలోదరిన్.
(2-25)

ఇందు 'త' కార శబ్దమును వరుసగా వాడి మాధురీ ధుర్యమైన కలస్వనముతో కర్ణరసాయనము గావించెను. 'త' కారము విశేషముగా వాడుటలోని ప్రత్యేకత వ్యాఖ్యాతలు తడవలేదు. 1 "తన్వి శబ్దమునకు త్ + అను + యస్యాఃసా - తన్వీ అని చిత్ర విగ్రహము. తకారమును అనుసరించిన విశేషణములు కలది తన్వీ అయినది. అందుచేత "త" అ తన్వి వెంట అంటి వచ్చినది.

భట్టుమూర్తి ప్రతిశబ్దమును అప్సరసవలె నాట్యము చేయించగలడిట్టి. ఆశబ్దముపై చమత్కార చిత్రములను చూపుటలో అందవేసిన చేయి.

గిరిక వీణ వాయించు చున్నది. విదూషకుడు ఆమెను చూచివచ్చి

"సైరవిహార ధీరలగు సారసలోచనలున్నచోటికిన్
బోరున లాతివారు చొరబూనినచో రసభంగ మంచునేఁ
జేరక పువ్వుఁదీవియల చెంతనె నిల్చి లతాంగి రూపు క
న్నారగఁ జూచి వచ్చితి-నవాంబు రుహాంబక! నీకుదెల్పగన్"

(2—55)

అని విన్నవించినాడు. ఈ పద్యములోని ప్రతిశబ్దము తన గర్భములో బ్రహ్మాండమైన అర్థగాంభీర్యమును నింపుకొన్నది. సారసలోచనలు రసభంగముచేత సాలోచనలగుట. వ్యాఖ్యలోనిదే! నవాంబురుహాంబక శబ్దమును త్రిమూర్తులకు మన్మథునికి అన్వయించి ఇవ్వటికి ఎందరో చెప్పియున్నారు.

'రూపు' శబ్దముపైన ఒక లక్షణామూలకమైన వ్యంగ్యము నిర్వచింప వచ్చును. బొడ్డులేని డాలరుగల సువర్ణహారమునకు "రూపు" అని పేరు. దీనిని కన్య రజస్వల అయిన తొమ్మిదవ రోజున మెడలో వేయుదురు. డాలరుపైన సరస్వతీ విగ్రహముండును. వివాహ సమయమున ఈ 'రూపు' ఆభరణము తీసి తాళికట్టింతురు. రాయలకాలములో ప్రత్యేకించి పెను

---

1. శ్రీ నరాల రామారెడ్డి శతావధాని వ్యాఖ్యానము.

గొండ ప్రాంతములోని పంప్రదాయమిది. 'పువ్వతీవియ' అని చమత్కరించి గిరిక సర్వాలంకార భూషిత అని సూచించు చున్నాడు. కవి శబ్దశక్తి వలన సాధించిన అర్థచమత్కారములు అనంతములు. మూర్తికవి 'సార-సలోచనుడు కూడ!' అంటే రస దృష్టి కలవాడని భావము. ఈ విషయము 'సారంగ' శబ్దమున మరుగుపరచి, "సారంగచ్ఛతీతి సారంగః" అని వింగడించి తన్నుతాను సమర్థించుకొన్నాడు. నిజముగ రామరాజభూషణుడు సాహిత్యరంగమున సైైర విహారధీరుడే!! అనగా స్వతంత్ర భావనా పరికల్పిత ధీరతా గుణుడని స్ఫురింప జేయుచున్నాడు.

నర్మసఖుడు 'మునివేషమున' గిరికను సమీపించెను ఇష్టసఖి మంజువాణితో సంభాషణ ప్రారంభించినాడు.

"అనుపమ భాగ్యలక్షణ సమన్విత యీరమణీలలామ! యీ
మనసిజ రాజరాజ్యరమ మానసవీధి తలంప సింధు నం
దన యచ లేంద్ర నందన యనం గన నయ్యెడి! నీలకాంగి పా
వనకుల గోత్ర భూతి-చెలువా! చెలువారగఁదెల్పవే" యనన్
(2—87

కులగోత్రము లేడింటిలో హిమవత్పర్వత మొకటి. హిమవంతుని కుమారుడే కోలాహలుడు. అతని 'కులగోత్రభూతి' గిరిక! ఈ పద్యమున గిరికను, 'లకాంగి' గా చిత్రించినాడు. ఇక్కడేమిటి? గిరిక జ్ఞప్తికి వచ్చిన ప్రతి సమయములోను 'లకాంగి' శబ్దమునే ప్రయోగించినాడు.

గిరిక లతవంటి శరీరము కలది. ఆమె కన్య. కన్య సహజముగ కృశాంగియేకదా! అంతేకాదు గిరిక అటు పర్వతమునకును ఇటు నదికి జన్మించినది కనుక-వనసంబంధమైన 'లకాంగి' శబ్దమును ఔచిత్యమెరిగి వలుతావుల గుర్తుచేసినాడు. 'లకాంగి' ఒక ప్రతిమధ్య రాగము కూడ!

వసుచరిత్ర కారుడు 'జగత్ప్రాణనందన కారుణ్య కటాక్షము' పొందిన అదృష్టవంతుడు. కనుక ఇందులోని వంచనాయతి పాత్రను రామా

యణము నందలి హనుమంతుని విశ్వరూపమునకు ప్రతిబింబముగా చెప్పినట్లు మనమూహించవచ్చును.

ఈ కావ్యమున పౌర్వాపర్యవిరోధము గాలించి వెతకిననూ కన్పించదు. ఉదాహరణకు ఒక్కటి మాత్రమే మనవి చేయుదును.

గిరికా వసురాజుల ప్రథమదర్శనము జరిగినది. పరస్పరము చూచుకొన్నారు. వారి అప్పటి యౌవనోద్రిక్త భావవాహిని గట్లు త్రెంచుకొని పొంగి పొరలినది ఇంతలో తల్లి పిలువఁబంచినది. అటుభావజుడు, ఇటు భావజ రూపుడు వసురాజు-గిరిక కాళ్లకు బంధము వేసినారు. సిగ్గుతో వెళ్లిపోవుటకు ప్రయత్నించినది గిరిక-అప్పుడు.

"నెనరున చేయివట్టి - తరుణీ! ధరణీ సరణీ పురంధ రుం
డనుపక పోవుచెట్లు? తగవా! నగవారడి వెట్టనంచు - జ
వ్వనిఁ చెలువెల్ల నిల్పి - 'మహివల్లభ! మా చెలిమీదిప్రేమ నీ
మనమునఁజాయకుండు మని' "మానినిఁ" ...

(8—74)

గేలిసేయుచు తోడ్కొని పోయినారు. కోపము మూర్తీభవించిన ఆ గిరికా రూపమే వసురాజు మనస్సులో నిల్చిపోయినది

"అనగరాజ భేదియును నానగరాని మనోరథంబుతో
"మానిని" నాత్మనిల్పి, ధృతిమాని, నిరంతర బాష్పవారిఁగ
న్గొనల నాని, మానికపు గోనలలో, నెల మావి కానలో
నానన విల్తుడేప, నలినానన యేగిన జాడ నేగుచున్"

(8—79)

ఆ 'మానినీ' విరహాతురుడై రాజధానికి మరలిపోయినాడు. ఇంతలో మంజువాణి రంగమున ప్రవేశించినది. వసురాజుకు గిరికామోక్తిక పారమును అందించినది. ఆ విరహవేదన-ద్విగుణీకృత మైనది.

"కమనీయ ద్యుతి ధామమా! విమల ముక్తాదామమా! సేమమా!
కమలా మోదకుఁ, దత్సఖీసమితికిం గల్యాణమా! తన్మరా
ళ మయూరీ శుకశాబ శారికల కెల్లన్ భద్రమా! తెల్పుమా!
ప్రమదా రత్నము పేరుగా నెద నినుం భావించి ప్రార్థించెదన్"
(4—100)

మొదలుగా గల పద్యముల ద్వారా హృదయ విదారకముగా విల పించినాడు. ఈ సన్నివేశమున కవి తన్ను తాను మరచి రసభావ స్రోతస్సు లను ప్రవహింపజేసినాడు. 'నిజమైన ప్రేమ, ఆత్మసౌందర్యము వియోగ కాలమున హృదయ మథనము వలన వ్యక్తము కాగలదని' నిరూపించినాడు. ఆ పద్యములు చదువుచున్నప్పుడు ఎంతటి కఠిన హృదయములైనా ద్రవింప గలవు.

మూర్తికవి సాహిత్యములో పరకాయ ప్రవేశ విద్యారహస్యము నేర్చిన మాంత్రికుడు. ఈ కవి కోడిరూపములో సాక్షాత్కరించి తనశక్తి సామర్థ్యములు ఎట్లు ప్రకటించుచున్నాడో రసికులు గమనింతురుగాక.

"ఒక నాడింద్రునియంత వేలుపు మదయోక్తిన్ విడంబించి, తా
నొక కాలంబెరింగింపవచ్చి, మునిశాపోద్వృత్తి పాలయ్యె, మా
మిక శబ్దంబది యల్పమే! [1]త్రిముని సంభావ్య [2]త్రికాలీ విభో
ధకమన్ రీతి - [3]త్రిభంగిగా మొఱపె బెంతన్ తామ్రచూడోత్తమున్.
(4—128)

---

1. త్రిమునులు ; సూత్రకారుడు పాణిని, భాష్యకారుడు పతంజలి, వాక్యకారుడు వరరుచి.
2. త్రికాలీ : భూత భవిష్యద్వర్తమాన కాలములు.
3. త్రిభంగి : వస్తు, నేతృ, రసాశ్రయములు.

తన్ను అనుసరించుట మహాకవీంద్రులకు సైతము సాధ్యముకాదు; తనశబ్దశక్తి అమోఘమైనది; తన కావ్యము పాణిని, పతంజలి, వరరుచి - శాస్త్రకారుల అమోదయోగ్య మైనది. అంతమాత్రమేకాదు - వసుచరిత్ర భూత భవిష్యద్వర్తమాన కాలములకు పనికివచ్చు గ్రంథము అని "ఛాలెంజి" చేసి తన పాండిత్య ప్రతిభా విశేషములను ఎలుగెత్తి చాటినాడు.

వసుచరిత్రలోని పద్యములు సంప్రదాయముగ చదివినప్పుడు ఆ సంక్షిప్తత (Brivity) అర్థమగును. ఈ కావ్యములో సంస్కారము కంటె పాండిత్యము కొన్నిపాళ్లు Dominate చేసినది (మించిపోయినది).

"అతులశైవలవతీ (2-122), సుమనోధివాస భాసుర (2-118), వేణిచలింప, సరసదరీ రుచిరీ (2-95)," మొదలైన పద్యములు కవి శ్లేష పాండిత్యమునకు, వర్ణనావైశద్యమునకు, వ్యంగ్యధోరణికి ఉదాహరణములు! వైపద్యములలో వాడిన "గోత్రతిలక - మహోనగము - ధరాధీశుడు" వంటి పదములు పద్యభామినికి తిలకముల వంటివి.

మనుచరిత్రలో మనోరమా వివాహ సమయమున చెప్పిన పద్యమిది

"అప్పుడు తూర్యముల్ మొరయ నమ్మిథునమ్ము విలోకనస్పృహాం
దెప్పలఁ దేలవంపఁబడు తెల్లనిచీర తెరం గ్రమంబునన్
గొప్పు మొగంబున ట్టుఁజను గొండలుఁదోప లతాంగి పోలెఁజె
ల్వప్పతిలన్ సుధారసపయోనిధి పెందరఁబుట్టు నిందిరన్
(మ. 5—80)

ఇది ప్రాచీన పూర్ణోపమ. ఇందులో క్రొత్తదనము లేదని మూర్తి కవి వెదవి విరచినాడు. వెంటనే

"హారిదంభోరుహలోచనల్ గగన రంగాభోగ రంగత్త మో
ఖరనేపథ్యము నొయ్య నొయ్య నడలింపన్ రాత్రి శైలూషికిన్
వరుసన్ మౌక్తిక పట్టమున్ నిటలమున్ వక్త్రింబునుందోచెనాన్
వారిణాంకాకృతి వొల్చెరేకయి, నగంబై, బింబమై తూర్పునన్.
(4—16)

అని ఒక వీధి నాటకదృశ్యమును చిత్రీకరించి రంగస్థితమైన 'రాత్రిశైలూషి' వదనము క్రమముగా ఎట్లు అగుపించినదో వర్ణించి తన నవీన గుణాలంకారమును ప్రదర్శించెను.

కావ్యారంభమున '(శీ) భూపుత్రి వివాహవేళ' అనుపద్యమున సీతావివాహమునకు, గిరికా వివాహమునకు సామ్యము చెప్పినాడు కవి. రెండునూ వసంత ర్తువులోనే జరిగినది. ఇర్వురు నాయికలు అయోనిజలు. ఒకరు నాగటిచాలులో మరొకరు నదీగర్భమున (River Bed జన్మించిరి. మరికొంత ఆలోచించిన లక్ష్మి, గిరికలు సింధు కన్యలే! మంధర పర్వతము సముద్రము మధించుట చేత లక్ష్మి; కోలాహలము భుక్తి మతిని (8-148) నిరోధించుట వలన గిరిక ఆవిర్భవించిరి. సీత లక్ష్మిదేవి అంశయే కదా.!

ఇట్లు గిరికా వసురాజుల దివ్యప్రణయ సౌందర్యమును కావ్య మృత రసప్రభావముతో లోకమునకు తెలియజెప్పిన మహాకవి భట్టుమూర్తి. 'భూతపసిండి' వంటి వలపుం పచరించు' (మ 8—88) వంశములో జన్మించిన వరూధినివలె గిరిక భోగవస్తువు కాదు. ఆమె కుసుమ సుకుమారియైన కుల పాలిక! నదీ నగ కులదీపిక! 'మహితలావణ్య మన్మథ మన్మథుండైన' వసు రాజును ప్రథమ దర్శనముచేతనే వలచి తనహృదయము సర్వస్వము అర్పించి నది. వసురాజుకూడ ఆనవనవోన్మేష తారుణ్య ప్రభాశాలిని, ఆలావణ్య రాశిని-తన హృదయ ఫలకము మీద చిత్రించుకొన్నాడు. ఆ దివ్యదంపతుల

ప్రణయమును ముక్తకంఠముతో గానముచేసి అజరామరుడైన అదృష్ట వంతుడు రామజరాజ భూషణుడు.

సాహిత్య రసపోషణ, సర్వాంకషప్రౌఢి, గానవిద్యావిశారద త్వము, కథాశిల్పరహస్య వేతృత్వము మూర్తిభవించిన కవితామూర్తి భట్టుమూర్తి! అతని అక్షయమైన, అక్షరమయమైన సాహితీశక్తులు అనన్య అభ్యములు. వసుచరిత్ర వంటి అపూర్వచమత్కార కథా సంవిధాన మహనీయమగు విలక్షణ ప్రబంధము ఆంధ్రసారస్వతములో మరొకటిలేదు.